అస్త్రం

జె.యు.బి.వి.ప్రసాద్

# మా 'మంచి' టీచర్లు

## అనేకానేక విషయాల మరో కోణంపై నెలకో విమర్శనాస్త్రం

పొగడ్తలూ, పొగడ్తలూ! ఎక్కడ చూసినా సరే పొగడ్తలే గానీ, విమర్శలనేవే కనబడవు. అందులో తర్కబద్ధమైన విమర్శలు బొత్తిగా కనబడవు. ఎందుకంటే, విమర్శ అంటే ఎవరికీ నచ్చదు. నేనేదో విమర్శగా అన్నానని, ఒకాయన, "మీరెప్పుడూ నెగిటివ్‌గా మాట్లాడుతారండీ! నాకు నచ్చదు" అంటూ విమర్శకి పెడముఖం పెట్టి, నాతో ఓ రెండేళ్ళు మాట్లాడ్డం మానేశాడు. అంటే ఎవరికీ, తాము ఇష్టపడుతున్న వాటికీ, అంగీకరించిన వాటికీ విరుద్ధంగా వినడం బొత్తిగా ఇష్టం వుండదు. అలా అని అందరూ, "మాకు విమర్శలంటే ఇష్టం వుండదండీ" అని అంటారా? ఊహూ! అలా అనరు. పైపెచ్చు విమర్శలని ఆహ్వానిస్తున్నామనే అంటారు. కానీ విమర్శలు మాత్రం పూలు విసిరినట్టుగా వుండాలి! ఘాటుగా వుండకూడదు! ఓ వెయ్యి పొగడ్తల మధ్యలో, ఒక చిన్న విమర్శ బహు జాగ్రత్తగా పొందు పరచాలి. అప్పుడు మాత్రమే వారు విమర్శకి బ్రహ్మరథం పడతారు! ఆ మధ్య కాలంలో ఒకాయన ఏదో మారుపేరుతో, ఓ వెబ్ పత్రిక్కి ఒక పెద్ద "విమర్శ"నాత్మక వుత్తరం రాశాడు. పత్రిక వారు దానికి పెద్ద పటం కట్టి, ప్రశంసలతో వేసుకున్నారు. నేనదేదో పెద్ద "విమర్శ" అనుకుని, సంబరపడి, చదివి భంగ పడ్డాను. "స్టేజీ మీద అధ్యక్షుని కావలించుకోవాలనిపించింది" లాంటి ప్రశంసల మధ్య ఓ చిన్న విమర్శ అక్కడక్కడ. అది చదివితే ఓ కార్టూన్ గుర్తొచ్చింది. అందులో ఒక బలవంతుడి కాలి కింద ఒక బలహీనుడి కాలు వుంటుంది. అప్పుడా బలహీనుడు, "అయ్యా! ఎలాగో పొరబాటున నా కాలు మీ కాలి కిందకి వెళ్ళిపోయింది. కాస్త దయచేసి తీసుకోనిస్తారా?" అని ప్రాధేయపడుతూ వుంటాడు.

విమర్శ అనేది పొగడ్తల మధ్యలో దూరి వుండనక్కర్లేదు. "విమర్శలు మా అభివృద్ధికి సాయం చేస్తాయండీ" అని, రాసేవాళ్ళు అంటూ వుంటారు. విమర్శ ముఖ్యోద్దేశం ఒక విషయంలోని మంచి చెడ్డలను బేరీజు వెయ్యడమే గానీ, అది రాసిన వాళ్ళను అభివృద్ధి పరచడానికి కాదు. విమర్శలు చదివి తమ రాతలు దిద్దుకుంటే, అది మంచి విషయమే. రాసేవాళ్ళు ఆనందంగా తీసుకునేట్టు చెయ్యడం విమర్శకుల బాధ్యత కాదు. అలాగే విమర్శకుల వెటకారానికి (హాస్యానికి) నొచ్చుకుంటే, విమర్శకులు చేసేదేమీ వుండదు. తర్క రహితమైన చర్చనీయాంశంలోంచే వెటకారాలు పుట్టుకొస్తాయి.

ఈ మధ్యనే ఒక కోట్ చదివాను ఎక్కడో. "సరైన దార్లూ, అవీ బాగా తెలిసీ, డ్రైవింగు మాత్రం రానివాడు విమర్శకుడు" అని. ఇది పూర్తిగా కరెక్టు కాదు. విమర్శకులు కూడా రచయితలు కావచ్చును. ఇంకో విషయం. విమర్శలనేవి ఇంకొకరి రచనల గురించే కానక్కర్లేదు అస్తమానూ. సమాజంలో అనేక విషయాలు గమనిస్తూ వుంటాము. వాటి మీద కూడా విమర్శలుంటాయి.

ఆఖరుగా ఈ శీర్షికలో నాతోబాటు మీరుకూడా రాయొచ్చును. ఎవరికన్నా ఒక విషయం మీద గట్టి తర్క బద్ధమైన విమర్శ వున్నప్పుడు, రాసి పంపవచ్చును. దాన్ని ఎడిట్ చేసే హక్కు పత్రిక్కి వుంటుంది. అలాగే విమర్శ అంటే "తిట్టడం" కాదని మనవి. ఔత్సాహికులు తమ విమర్శల్ని editor@koumudi.net కి పంపించండి.

అది ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తెలుగు మీడియం కెమిస్ట్రీ క్లాసు. కొత్తగా జూనియర్ కాలేజీలో చేరిన విద్యార్థులు, ఒకరినొకరు "మీరు", "మీరు" అని పిలుచుకుంటూ, తమ కొచ్చిన కొత్త పదవికి మురిసిపోతున్నారు. మొత్తానికి అందరూ కలిసి, రాబోయే కెమిస్ట్రీ లెక్చరరు కోసం ఎదురుచూస్తున్నారు. బ్రౌన్ రంగు బెల్ బాటం పాంటూ, టక్ చేసి, పై రెండు బొత్తాలూ వదిలేసిన పింక్ రంగు పొడుగు చేతుల చొక్కా (చొక్కా చేతులు మోచేతి వరకూ మడిచి వున్నాయి, ఎందుకంటే చేతికున్న కప్పంత వాచీ కనబడాలి గదా అందరికీ!), అరచెయ్యంత బకిల్‌తో వెడల్పాటి తోలు బెల్టూ, బకిల్ మీద 007 అనే నెంబరూ, మీసాల కింద వరకూ వచ్చిన సైడ్ బర్న్సూ, మెడ దిగిన జుట్టూ వున్న ఇరవై రెండేళ్ళ కెమిస్ట్రీ లెక్చరర్ క్లాసులో అడుగుపెట్టాడు. పిల్లలంతా ఆ అవతారం చూసి తెల్లబోయారు. వెనకాల బెంచీ లోని కొందరు అల్లరి కుర్రాళ్ళు జేమ్సు బాండు సినిమా సంగీతం ప్రసారం చేశారు చిన్న గొంతుకల్తో. ముసి ముసి నవ్వులతో కెమిస్ట్రీ పుస్తకం తెరిచి పాఠం చదవడం మొదలుపెట్టాడు ఆ కుర్ర లెక్చరరు. ఇంగ్లీషు ఏక్సెంటుతో వెలువడుతున్న రసాయన శాస్త్ర పదాలు పిల్లల కర్థం అయితే వొట్టు. పాఠం చదవడమే పాఠం చెప్పడమయితే, ఇంకేం అర్థం అవుతుంది పాఠం? ఎమ్మెస్సీ ఆ సంవత్సరమే పాసయి, చిరు రికమెండేషనుతో జూనియర్ లెక్చరరుగా చేరాడా కుర్రాడు మరి!

అది బి.యస్సీ ఫిజికల్ కెమిస్ట్రీ ఇంగ్లీషు మీడియం క్లాసు. నిండుగా చీర కట్టుకుని, తల నిండా పూలతో, చేతుల నిండా గాజులతో క్లాసులో అడుగు పెట్టింది ఫిజికల్ కెమిస్ట్రీ లెక్చరర్. ఆవిడ అవతారం చూసి కొంచెం తెల్లబోయినా, మొత్తానికి కాస్త గౌరవంగానే అటెండెన్సు పలికారు విద్యార్థులు. ఆ పని కాగానే, ఆవిడ చిన్న సూట్‌కేసంత వున్న తన హేండ్‌బేగులోంచి కెమిస్ట్రీ నోట్సు కాగితాల కట్టలు తీసింది. తనకు కావల్సిన కట్ట వుంచుకుని, మిగిలినవి హేండ్‌బేగులో పెట్టుకుంది. విద్యార్థుల వేపు ఒక చిరునవ్వు విసిరి, బోర్డు వేపు తిరిగి, చేతిలో కట్టలో వున్న నోట్సంతా, గాజుల చప్పుళ్ళతో బోర్డు మీద రాయడం మొదలు పెట్టిందావిడ. రాస్తున్నదంతా బిగ్గరగా చదువుతూ రాయడం మర్చిపోలేదావిడ. అలా బోర్డు వేపు తిరిగినావిడ, క్లాసు బెల్లు అయ్యేవరకూ వెనక్కి తిరగలేదు పాపం! అలా రాసుకుంటూ, చెరుపుకుంటూ, మళ్ళీ రాసుకుంటూ, రాసేది చదువుకుంటూ పోయిందావిడ. క్లాసు రూమంతా మల్లెపూల వాసన. మొదటి బెంచీలో కాస్త బుద్ధుండి, భయస్తులైన విద్యార్థులు ఆవిడ బోర్డు మీద రాసిందంతా తమ నోట్సులోకి ఎక్కించుకున్నారు. మిగిలిన పిల్లలు కబుర్లు చెప్పుకుంటూనో, నిద్రపోతూనో కాలం గడిపి, అప్పుడే బెల్లు కొట్టేశారా అని ఆశ్చర్యపోతున్నారు. "ఎమ్మెస్సీ పాసయ్యావు గదా, కాలేజీ లెక్చరరుగా వుద్యోగం చేసి, సంసారానికి చేదోడు, వాదోడుగా వుండకూడదూ" అనే భర్త మాటల్ని భక్తిగా తలకెక్కించుకుని, తెలిసున్న వాళ్ళ ద్వారా ఉద్యోగం సంపాదించిందావిడ మరి!

అది ఎమ్మెస్సీ (టెక్నాలజీ) ఎలక్ట్రానిక్సు మూడో సంవత్సరం క్లాసు. ఆ యేడే వాళ్ళకి టీవీ ఇంజినీరింగు సబ్జెక్టు మొదలుపెడుతున్నారు. అప్పుడప్పుడే జనాల ఇళ్ళల్లోకి టీవీ ప్రవేశించడంతో, క్లాసు పిల్లలకి టీవీతో కాస్త పరిచయం వుండి, ఆ సబ్జెక్టు ఆసక్తితో నేర్చుకోవాలని కూర్చుని, కొత్త లెక్చరరు కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా పిహెచ్. డీ డిగ్రీ వుంటేనే గానీ, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకి టీచ్ చేసే అర్హత వుండదు. కానీ ఇప్పుడు రాబోయే కొత్త లెక్చరరు పెద్ద రెకమెండేషనుతో వస్తున్నాడు. అందుకని అయిదేళ్ళ లోపున పిహెచ్.డీ చేస్తే సరిపోతుందన్న షరతుతో వుద్యోగం ఇచ్చారు. కొత్త లెక్చరరుని చూసి ఆశ్చర్యపోయారు విద్యార్థులు. చెప్పకపోతే, వాళ్ళలో ఒకడుగా వున్నాడు. గబగబా అటెండెన్సు తీసుకున్నాడు. చాక్‌పీస్ తీసుకుని బోర్డు మీద టీవీ ఇంజినీరింగ్ అని రాశాడు. తరవాత కాస్సేపు అటూ, ఇటూ దిక్కులు చూశాడు. చమటలు పట్టేశాయి అతనికి. "ఫేన్ తిరగడం లేదా క్లాస్‌రూంలో" అని సీలింగు వేపు చూశాడు. ఫుల్ స్పీడులో దాని మానాన అది తిరుగుతూనే వుంది. కాస్సేపు క్లాసు బయటకి చూశాడు. బలవంతంగా నవ్వాపుకుంటున్న విద్యార్థుల మొహాలు చూడకుండా వుండటానికి చాలా ప్రయత్నించాడు. చేతి

వాచీ చూసుకున్నాడు. ఇంతా చూస్తే ఆయన క్లాసులోకి వచ్చి అయిదు నిమిషాలే అయింది. ఇంక వుండలేక, పుస్తకం తీసుకుని క్లాసులోంచీ బయటకి నడిచాడాయన. వెనక నించీ విద్యార్థుల నవ్వులు వినిపిస్తూనే వున్నాయి.

అది ఎం. ఫిల్ కంప్యూటర్ సైన్సు విద్యార్థుల క్లాసు. వాళ్ళ కోర్సు కోఆర్డినేటరే వాళ్ళకి "ఆపరేటింగ్ సిస్టం" క్లాసు కూడా తీసుకుంటాడు. ఈ విద్యార్థులు ఫెలోషిప్ కోసం, యూనివర్సిటీకి వచ్చాక, రిజిస్టరులో సంతకం పెట్టాలి పొద్దున్నే. రిజిస్టరు వాళ్ళ కోఆర్డినేటరు కూర్చునే బల్ల పక్కనే వుండేది. వాళ్ళు సంతకం చెయ్యగానే, వాళ్ళని ఆయన అక్కడే పట్టుకునేవాడు. కూర్చోపెట్టి కుల, గోత్రాలడిగేవాడు ముందర. వాళ్ళు ఆశ్చర్య మొహాలతో చూస్తే, "చాలా మంది పెళ్ళి సంబంధాల కోసం నన్నడుగుతూ వుంటారు. వాళ్ళ కిద్దామనీ ఈ వివరాలన్నీ" అని నవ్వుతాడు. తరువాత ఫోర్ట్రాన్‌కీ, కోబాల్‌కీ తేడాలు చెప్పమంటాడు. వాళ్ళేం చెప్పినా అది కరెక్టు కాదంటాడు. మొత్తానికి కేఫిటేరియాలో వాళ్ళ బ్రేక్‌ఫాస్ట్ టైం అయిపోయి, క్లాసు మొదలుపెట్టే టైం అయ్యాక గానీ వదిలేవాడు. ఏ రోజు ఆయనకి బలవుతారో తెలియక విద్యార్థులు సతమత మవుతూ వుండేవారు. ఆయన తీసుకున్న క్లాసులో ఓ కుర్రాడి చేత టెక్స్టు బుక్ గట్టిగా చదివించేవాడు. మిగిలిన వాళ్ళని దానికి అర్థం చెప్పమనే వాడు. అంతే అదే ఆయన టీచింగు! ఎదురు తిరిగి ఏమన్నా అనడానికి విద్యార్థులకి భయం.

"కౌముది" పత్రికలో "మా మంచి టీచరు" అంటూ పాఠకులు తమ అనుభవాలని సంతోషంగా చెప్పుకుంటే, నేనిలా నెగెటివ్‌గా చదువు చెప్పడం రాని టీచర్ల గురించి రాస్తున్నానని అనుకుంటున్నారా? నా పాయింటు అది కానే కాదు.

ఎలిమెంటరీ స్కూల్లో చదువు నేర్పాలంటే టీచర్ ట్రైనింగు అయి తీరాలి. హైస్కూల్లో చదువు చెప్పాలంటే, బి. ఇడీ గానీ, ఎం. ఇడీ గానీ చదివి తీరాలి. కానీ, జూనియర్ కాలేజీలో చదువు చెప్పడానికి గానీ, కాలేజీలో చదువు చెప్పడానికి గానీ, యూనివర్శిటీలో చదువు చెప్పడానికి గానీ వేరే క్వాలిఫికేషన్లు ఎందుకక్కర్లేదూ? పెద్ద క్లాసుల పిల్లలకి చదువు చెప్పాలంటే, స్పెషల్ ట్రైనింగు ఎందుకు అవసరం లేదూ? ఎవరినయినా "మీకు ఎక్కువగా నచ్చిన టీచరు ఎవరూ?" అని అడిగితే, ఎక్కువ మంది ఎలిమెంటరీ స్కూలు టీచరునో, హైస్కూలు టీచరునో చెబుతారు. వారు ఏ టీచరు ట్రైనింగో, లేదా బి. ఇడీ డిగ్రీయో చేసి వుంటారు.

విద్యార్థులకి చదువు చెప్పాలంటే, చెప్పాల్సిన పద్ధతులూ, విద్యార్థుల మనస్తత్వ విశ్లేషణా, వగైరాలన్నీ నేర్చుకోవాలి కదా! ఎమ్మెస్సీ పాసవడమేనా బి.యస్సీకి చదువు చెప్పడానికి కావల్సిన అర్హత?

ఈ గోల అమెరికాలో కూడా కాస్త వున్నట్టే వుంది. మా కజిన్ భార్య ఒక ఎలిమెంటరీ స్కూల్లో స్పెషల్ చిల్డ్రన్‌కి చదువు చెబుతారు. వుద్యోగం కోసం ఆవిడ చదివిన చదువులూ, తీసుకున్న ట్రైనింగులూ ఎన్నో వున్నాయి. ఒక్క క్లాసు కోసం ఎంత ప్రిపేర్ అవ్వాలో ఆవిడ చెబుతూ వుంటే, ఆశ్చర్యం వేసేది. అలాగే హైస్కూల్లో కూడా చదువు చెప్పాలంటే ఏదో టీచింగ్ లైసెన్సు తీసుకోవాలని అన్నారు. మరీ కాలేజీ వచ్చేసరికి ప్రొఫెసర్లు ఎటువంటి ట్రైనింగు తీసుకుని వున్నారూ? పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు "టీచింగ్ అసిస్టెంట్లు" అనే పేర్లతో, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకి డిస్కషన్ క్లాసులు తీసుకుంటూ వుంటారుట. వీళ్ళు నిన్న గాక మొన్న అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు. అందులో వచ్చిన కాసిని గ్రేడ్లు తప్పితే, ఎటువంటి ట్రైనింగూ చేసిన వాళ్ళు కారు.

కాలేజీల్లోనూ, యూనివర్శిటీల్లోనూ లెక్చరర్లకి చదువు చెప్పడం సరిగా వచ్చా, రాదా అన్నది విద్యార్థుల "అదృష్టం" మీద ఆధారపడి వుంటోందన్న మాట! సబ్జెక్టు తెలియడమే టీచ్ చెయ్యడానికి కూడా అర్హత అయిపోయింది.

ఈ పరిస్థితులు ఇప్పట్లో మారతాయన్న నమ్మకం మాత్రం లేదు.


జె.యు.బి.వి.ప్రసాద్ గారు భార్య, ఇద్దరు పిల్లలతో క్యుపర్టినో, కాలిఫోర్నియాలో నివాసం. అందరి పుస్తకాలూ చదివినా ఎక్కువగా గురజాడ, చలం, శ్రీపాద, రంగనాయకమ్మ రచనలు ఇష్టం.